క్లుప్తంగా

వత్సవాయమ్మ తిరుకల్యాణం



వత్సవాయి: శ్రీరామ జగపతి దేవసమేత శ్రీ వత్సవాయమ్మ తల్లి తిరుకల్యాణం మంగళ వారం రాత్రి ఘనంగా నిర్వహించారు. తిరునాళ్ల ప్రారంభం సందర్భంగా రాత్రి అంకమ్మ అమ్మవారిని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. వత్సవాయమ్మ కల్యాణ ఘట్టాన్ని దంపతులు పీటలపై కూర్చుని శాస్త్రయుక్తంగా జరిపించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మ వారి కల్యాణంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం మధ్యాహ్నం జల బిందెల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ పి.అభిమన్యు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో సీహెచ్ హరిదుర్గానాగేశ్వరరావు, ధర్మకర్త గుత్తా కృష్ణమూర్తి గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంపీపీ మార్కపూడికి పలువురి అభినందన



జగ్గయ్యపేట అర్బన్: ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల పంచాయతీరాజ్ విభాగం జోనల్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన పెనుగంచిప్రోలు ఎంపీపీ మార్కపూడి గాంధీని పలువురు అభినందించారు. జగ్గయ్యపేటలోని ప్రభుత్వాస్పత్రి ఆవరణలో బుధవారం జరిగిన అభినందన కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనేత సామినేని వెంకట కృష్ణప్రసాద్ తదితరులు గాంధీని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట పట్టణ, మండల అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్, చిలుకూరి శ్రీనివాసరావు, విజయవాడ దుర్గ గుడి ట్రస్టీబోర్డు సభ్యుడు నంబూరి రవి, ఫిరోజ్‌ఖాన్, పార్టీ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు బద్దూ నాయక్, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

తొర్రగుంటపాలెం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

జగ్గయ్యపేట అర్బన్: తొర్రగుంటపాలెం ఇటీవల మున్సిపాలిటీలో విలీనం అయిన తరువాత ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు, 8 వ వార్డు కౌన్సిలర్ సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ తెలిపారు. స్థానిక 8 వ వార్డు తొర్రగుంటపాలెంలో బుధవారం ఆయన వార్డు వలంటీర్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్లు, డ్రెయిన్లు, తాగు నీటికి ఆర్వో ప్లాంట్, నూతనంగా విద్యుత్ స్తంభాలతో కొత్త లైన్లు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. స్థానికంగా ఇళ్ల స్థలాలు లేక కొందరు ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని వలంటీర్లు చెప్పడంతో హౌసింగ్ ఏఈతో మాట్లాడి త్వరలో ఈ సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని కోరారు.

క్రీడా పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నందిగామ టౌన్: మానవ శారీరక దారుఢ్యానికి వ్యాయామం, క్రీడల ఆవశ్యకత ఎంతో ఉందని ఏసీపీ నాగేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక ఏసీపీ కార్యాలయంలో టిజోలా కప్-2023 క్రీడా పోటీల వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిజోలా కప్ - 2023 పేరుతో టిజోలా ఫుడ్ డెలివరీ, జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నందిగామ సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల పోలీసులకు, ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈ నెల 11,12 తేదీల్లో పోటీలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో సీఐ సతీష్, ఎస్ఐలు పండు దొర, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి జన్మనక్షత్ర వేడుకలు

నందిగామటౌన్: పట్టణంలో ఉన్న భూనీలా సమేత చెన్నకేశవ స్వామి వారి ఆలయంలో మహాలక్ష్మి అమ్మవారి జన్మనక్షత్ర వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అర్చక స్వాములు దివి రత్నమాచార్యులు, ఆదోక్షజాచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణల నడుమ గోదాదేవి మహాలక్ష్మీ అమ్మవార్లకు సహస్ర నామ కుంకుమార్చన, భూనీలా సమేత లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి మూలవరులకు పుష్పార్చన పూజలు వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని రామలింగేశ్వర నగర్‌లో హరిహర పుత్ర అయ్యప్ప స్వామి వారి ఆలయంలో స్వామి వారి ఉత్తర జన్మనక్షత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చక స్వామి రాజేష్ శర్మ స్వామి వారి మూలవరులకు సుగంధ ద్రవ్య పంచామృతాభిషేకాలు, అష్టోత్తర సహస్ర నామ పుష్పార్చన, మూలమంత్ర హోమాలు, పూర్ణాహుతి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఆడాళ్లూ.. మీకు జోహార్లు!

కంచికచర్ల: అంతర్జాతీయ మహిళా దినోత్సవం బుధవారం మండల కేంద్రమైన కంచికచర్లతో పాటు పలు గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల మహిళా సర్పంచులు, మహిళా అధికారులను శాలువాలతో సత్కరించారు. పరిటాలలో వీఆర్వో శ్రీలక్ష్మి, ఏఎన్ఎం శ్రీలత, గ్రేడ్-5 సచివాలయ ఉద్యోగి రాజ్యలక్ష్మిలను సర్పంచ్ యద్దనపూడి ఆనందజ్యోత్స్న శాలువాలతో సత్కరించారు. జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో సర్పంచ్ ఆనందజ్యోత్స్నను సత్కరించారు. హార్ట్ అమలు సహాయక సంస్థ ఆధ్వర్యంలో అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మోదుగు శివ ప్రసాద్, రామచంద్రరావు, నాగేశ్వరరావు, రామశేషాచార్యులు పాల్గొన్నారు.

అమితసాయి, మిక్ ఇంజినీరింగ్ కళాశాలల్లో...

పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్, కంచికచర్ల మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలల్లో మహిళా దినోత్సవం నిర్వహించినట్టు ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.శశిధర్, డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. దీక్షా కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులు, ఉపాధ్యాయులను సత్కరించారు.

మహిళలకు అండగా ఎన్నో చట్టాలు

పెనుగంచిప్రోలు: మహిళలకు అండగా ఎన్నో చట్టాలున్నాయని జగ్గయ్యపేట జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.శోభారాణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పోక్సో చట్టం, గృహహింస చట్టం మహిళల రక్షణ కోసం ఉన్నాయన్నారు. సర్పంచ్ వేల్పుల పద్మకుమారి మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ధనుంజయ, ఏజీపీ టీఎల్ నరసింహారావు, సీనియర్ న్యాయవాదులు పసుపులేటి సత్యశ్రీనివాసరావు, శోభాతోరణి, బసవయ్య, ఆరేపల్లి వెంకటేశ్వర్లు, కిషోర్, రాజు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుళ్లకు సత్కారం

వత్సవాయి: మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగాలని ఎస్ఐ బి.అభిమన్యు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ దంపతులు మహిళా కానిస్టేబుళ్లను కొత్త దుస్తులతో సత్కరించి ఘనంగా సన్మానించారు. మండల మహిళా సమాఖ్య అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కాటేపల్లి రామలక్ష్మి, సర్పంచ్ భూక్యా సీతమ్మ, జగ్గయ్యపేట మున్సిపల్ వైస్‌చైర్మన్ పఠాన్ హాబీమున్నీసాలను సమాఖ్య అధ్యక్షురాలు గంగిపోగు శిరీష ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.



కంచికచర్ల: పరిటాలలో మహిళా ఉద్యోగులను సత్కరిస్తున్న సర్పంచి ఆనందజ్యోత్స్న



పెనుగంచిప్రోలు: మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి శోభారాణి, పక్కన సర్పంచ్ పద్మకుమారి



వత్సవాయి: మహిళా కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న ఎస్ఐ అభిమన్యు దంపతులు, సిబ్బంది



పెనుగంచిప్రోలు: మహిళా సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్ పద్మకుమారి

రక్తదాన శిబిరం

పెద్దాపురం(వీరులపాడు): మహిళలను గౌరవించుకోవటం మన బాధ్యత అని తహసీల్దార్ ఆశయ నాయక్ అన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి నివాసంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, గ్రామ మహిళలు పాల్గొన్నారు. మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలో ఎనర్జీస్ బ్యాటరీ కంపెనీ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. విజయవాడ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో కంపెనీ సిబ్బంది 50 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో కంపెనీ ఎండీ అరందర్ ఫెరారే, జీఎం షరీఫ్, హరిబాబు, నాగేశ్వరరావు, పీవీ రమణరావు, మీరా సాహెబ్ పాల్గొన్నారు.

మంచి సమాజం మహిళలతోనే సాధ్యం

పెనుగంచిప్రోలు: మంచి సమాజం మహిళలతోనే సాధ్యమని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి అన్నారు. స్థానిక కేడీసీసీ బ్యాంక్‌లో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బ్యాంక్‌లో మహిళా సిబ్బంది, ఖాతాదారులను సన్మానించారు. కార్యక్రమంలో బ్యాంక్ చీఫ్ మేనేజర్ పి.దుర్గాప్రసాద్, మేనేజర్ టి.సరోజని, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీగా పుట్టడం ఒక గొప్ప వరం

జగ్గయ్యపేట అర్బన్: సృష్టికి ప్రతి సృష్టి నిచ్చి సమాజానికి మార్గనిర్దేశనం చేసే మహిళగా పుట్టడం ఒక గొప్ప వరం అని విజ్ఞాన్ విద్యా సంస్థల డైరెక్టర్ తన్నీరు సుధారాణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పట్టణంలో బుధవారం పలు సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సెయింట్ ఆన్స్ హాస్పిటల్ అనుబంధ విభాగం అయిన జగ్గయ్యపేట కీర్తి పరస్పర సహకార పొదుపు, పరపతి సంఘం లిమిటెడ్ ఇన్‌చార్జ్ సిస్టర్స్ నిర్మల, ఫెలీస్టా ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంతో పాటు నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన 17 గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలు వివిధ రకాల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ఆట, పాటలతో అలరించారు.



జగ్గయ్యపేటటౌన్: కేక్ కటింగ్ కార్యక్రమంలో తన్నీరు సుధారాణి, సిస్టర్లు, మహిళలు

కేడీసీసీ బ్యాంక్‌లో మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం బుధవారం స్థానిక కేడీసీసీ బ్యాంక్ పేట శాఖలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్‌లో పనిచేస్తున్న మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ దుర్గాప్రసాద్, మేనేజర్ కె.కమలాకర్, సొసైటీ సీఈవో కనపర్తి నారాయణరావు, రిటైర్డ్ మేనేజర్ గింజుపల్లి సుబ్బారావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ లేకుంటే సృష్టే లేదు

నందిగామ టౌన్: మహిళ లేకుంటే సృష్టే లేదని, మహిళను గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం రాత్రి అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా నాలుగు మండలాల మహిళా ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ సమానత్వం, లింగవివక్ష నిర్మూలన వంటివి చిన్నతనం నుంచే పిల్లలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. పిల్లలను హెచ్చుతగ్గులు లేకుండా సమానత్వంతో చూడాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సంరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటూ మహిళా పక్షపాతిగా పేరు తెచ్చుకున్నారని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు అన్నారు. నామినేటెడ్ పదవుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించారని, పదవులు పొందిన మహిళలు నిస్వార్థంగా ప్రజా సేవ చేసి తమ సమర్థతను చాటుకోవాలని ఆయన ఆకాంక్షించారు.



నందిగామటౌన్ : మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

మహిళలం మేమేం చేయగలమని అధైర్య పడకుండా ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం మహిళా ప్రజా ప్రతినిధులతో పాటు కార్యక్రమంలో పాల్గొన్న మహిళలను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

చీరల పంపిణీ

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఎమ్మెల్యే జగన్‌మోహనరావు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్‌లు మాదుగుల నాగరత్నం, ఓర్సు లక్ష్మి, ఎంపీపీలు అరిగెల సుందరమ్మ, వేల్పుల ఏశమ్మ, కోటేరు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు అమర్లపూడి కీర్తి సౌజన్య, వేల్పుల ప్రశాంతి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, జిల్లా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు శాఖమూరి వెంకట కుమారి, నాయకులు షేక్ ఫాతిమా, కోలేటి నాగరాణి, ఆనంద జ్యోత్స్న వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దొంతిరెడి దేవేందర్ రెడ్డి, వైఎస్ఎన్ ప్రసాద్, చిరుమామిళ్ల చైతన్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో..

పట్టణంలోని రైతు బజార్‌లో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళా వ్యాపారులను ఈవో అజయ్‌కుమార్, సిబ్బంది ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీహరి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో..

పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి వారి ఆలయంలో మానవ హక్కుల సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. వాసవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీరాజ్యంతో పాటు పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు.

ఉత్సాహంగా హోలీ సంబరాలు



కంచికచర్లలో హోలీ పండగ సందర్భంగా రంగులు పూసుకుని నృత్యాలు చేస్తున్న యువతీ యువకులు, వృద్ధులు



పేట మున్సిపల్ కూడలిలో హోలీ సంబరాల్లో నృత్యాలు చేస్తున్న గౌరీబాయి సేవాసమితి, బంజారా సభ్యులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో బుధవారం హోలీ పండుగ సంబరాలు ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో చిన్నా,పెద్ద అనే భేదాలు లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. స్థానిక మార్కెట్ యార్డులో గౌరీబాయి సేవా సంఘం ఆధ్వర్యంలో హోలీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు లాహోరి బద్దూనాయక్ నాయకత్వంలో వివిధ వార్డుల నుంచి సుగాలీలు(లంబాడీలు)ఊరేగింపుగా వచ్చి అత్యంత ఉత్సాహ భరితంగా నృత్యాలు చేస్తూ రంగులు చల్లుకుంటూ ఉత్సవాలు జరుపుకొన్నారు. అనంతరం వందలాది మంది మార్కెట్ యార్డు నుంచి ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కూడలిలో ఆనందంగా రంగులు జల్లుకుంటూ డీజే పాటలతో నృత్యాలు చేశారు.

మార్కెట్ యార్డులో మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక మార్కెట్ యార్డులో బంజారా మహిళల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలంతా మార్కెట్ యార్డు డైరెక్టర్ లాహోరి బాలమ్మతో పాటు వివిధ రంగాలలో ఉత్తమ సేవలందించిన మహిళలను ఘనంగా సన్మానించారు.

కంచికచర్లలో హోలీ వేడుకలు

కంచికచర్ల: స్థానిక సూర్యానాయక్ తండాలో సుగాలీలు బుధవారం హోలీ పండుగ ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. చిన్నా, పెద్దా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు.

రంగాపురంలో హోలీ వేడుకలు

వీరులపాడు: మండలంలోని ఆయా గ్రామాలలో ప్రజలు హోలీ పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. రంగాపురం గ్రామంలో మహిళలు, చిన్నారులు, పెద్దలు వయో భేదం లేకుండా రంగులు చల్లుకుంటూ పండుగను జరుపుకొన్నారు. అల్లూరు, తిమ్మాపురం, గూడెంమాధవరం గ్రామాల్లోని సుగాలీలు పండుగను అత్యంత వైభవంగా జరుపుకొన్నారు.

ముగిసిన శిలువగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు

నందిగామ టౌన్: ఏసు మార్గం ప్రేమ మార్గమని, ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మార్గంలో నడుచుకోవాలని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని పల్లగిరి సమీపంలోని పరిశుద్ధ శిలువగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు బుధవారం రాత్రితో ఘనంగా ముగిశాయి. మహోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యేకు నిర్వాహకులు, ఫాదర్‌లు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఏసు బోధనలు సర్వ మానవాళికి అనుసరణీయమైనవన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ తోటి వారి పట్ల ప్రేమ, దయతో మెలగాలని, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే జగన్‌మోహనరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విజయవాడ మేత్రాసన పీఠాధిపతి బిషప్ తెలగతోటి రాజారావు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, ఎంవై దాసు, చర్చి ఫాదర్ ఫిలోమెన్ రాజు, పలువురు నాయకులు, పాస్టర్‌లు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చిన్న తిరునాళ్లు విజయవంతానికి సహకరించాలి

ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా

పెనుగంచిప్రోలు: శ్రీ తిరుపతమ్మ వారి చిన్న తిరునాళ్లలో భాగంగా ప్రధాన ఘట్టమైన అనిగండ్లపాడు గ్రామం నుంచి గురువారం వచ్చే పసుపు కుంకుమల బండ్ల కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం డీసీపీ మేరీ ప్రశాంతి, ట్రాఫిక్ డీసీపీ కె.శ్రీనివాసరావు, నందిగామ ఏసీపీ జి.నాగేశ్వరరెడ్డితో కలిసి తిరునాళ్లపై సమీక్ష నిర్వహించారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ పుట్టింటి పసుపు-కుంకుమల కార్యక్రమానికి భారీగా భక్తులు వస్తారని, అందుకు అనుగుణంగా విస్తృతంగా బందోబస్తు నిర్వహిస్తామన్నారు. జగ్గయ్యపేట సీఐ నాగమురళి, ఎస్ఐ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న సీపీ టి.కె.రాణా, డీసీపీలు మేరీ ప్రశాంతి, శ్రీనివాసరావు(ట్రాఫిక్) ఏసీపీ నాగేశ్వరరెడ్డి

పీహెచ్‌సీ తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ

పెనుగంచిప్రోలు: వైద్యాధికారి, సిబ్బందికి మధ్య సమన్వయం లేదని జిల్లా వైద్యాధికారి ఎం. సుహాసిని అసహనం వ్యక్తం చేశారు. ఆమె బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాక్సిన్‌లకు సంబంధించి అన్ని గ్రామాలకు పంపకుండా ఆసుపత్రిలో నిల్వ చేయటంపై సంబంధిత సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాక్సిన్‌లు నిల్వ చేసేందుకు సరిగా డబ్బాలు కూడా ఉండవా అని ప్రశ్నించారు. వెంటనే వ్యాక్సిన్ పంపిణీకి చర్యలు తీసుకోవాలని వైద్యాధికారి ఇందిరకు సూచించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆసుపత్రిపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో డీఎల్‌ఓతో విచారణ కూడా నిర్వహించామని, నివేదిక వచ్చిన తరువాత జిల్లా కలెక్టర్, హెల్త్ డైరెక్టర్‌కు పంపించి చర్యలు చేపడతామన్నారు. ముఖ్యంగా సమన్వయ లోపం, విధుల పట్ల సరిగా స్పందించక పోవటాన్ని గుర్తించామన్నారు. వైద్యాధికారి ఇందిర మాట్లాడుతూ సిబ్బంది తక్కువగా ఉండటంతో కొన్ని సమస్యలు వస్తున్నాయన్నారు. సిబ్బంది కూడా విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు.



వ్యాక్సిన్‌పై వైద్యాధికారి ఇందిరను ప్రశ్నిస్తున్న డీఎంహెచ్‌ఓ సుహాసిని

మండల కేంద్ర మార్పుపై అవగాహన ర్యాలీ

జుజ్జూరు(వీరులపాడు): మండల కేంద్రాన్ని మారుస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని ఎంపీపీ కోటేరు లక్ష్మి అన్నారు. మండల కేంద్ర మార్పును హర్షిస్తూ మహిళలతో కలిసి మండలంలోని జుజ్జూరు గ్రామంలో బుధవారం ఆమె అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలనా సౌలభ్యం కోసమే మండల కేంద్రాన్ని వీరులపాడు నుంచి జుజ్జూరుకు మార్చారన్నారు. మండల కేంద్ర మార్పులో ఎటువంటి రాజకీయాలకు, స్వార్థ ప్రయోజనాలకు తావు లేదని తెలిపారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మండల ప్రజలు రుణపడి ఉంటారని చెప్పారు. అధికారంలోకి రాగానే మండల కేంద్రాన్ని జుజ్జూరు మారుస్తామని చెప్పి మాట నిలుపుకొన్న శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ రమావత్ కోటి, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, మేడికొండూరు రవికుమార్, జల్లేపల్లి స్వామి, షేక్ నాగుల్‌మీరా, లింగంశెట్టి నవీన పాల్గొన్నారు.

● అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



చిన్నతిరునాళ్లకు పొంగళ్లతో వస్తున్న భక్తులు



క్యూలైన్‌లో భక్తుల రద్దీ

శ్రీతిరుపతమ్మ అమ్మవారి చిన్నతిరునాళ్లలో రెండవరోజు బుధవారం భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచే భక్తులు మునేరులో స్నానాలు చేసి పాలు, పొంగళ్లతో అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మునేరులో పెద్ద ఎత్తున గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. ఆలయం వద్ద మంగళవారం అర్ధరాత్రి వరకు నిర్వహించిన బుర్రకథలు, సంగీత కచేరి, జానపద గీతాలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి.

–పెనుగంచిప్రోలు